సాక్షి
సూర్యాపేట
శుక్రవారం, 19, ఏప్రిల్, 2024



ప్రజల చేతిలో అస్త్రం..
ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే ఫొటో, వీడియో, ఆడియో ఏదైనా రికార్డు చేసి సీ–విజిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. – 8లో



ఈవీఎంల తరలింపు
లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను తరలించారు. – 8లో

గరిష్ఠం / కనిష్ఠం
44° / 27°
వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

వేసవి సెలవుల దృష్ట్యా తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని ఎస్పీ రాహుల్‌హెగ్డే సూచించారు. నాలుగు నెలలుగా జిల్లాలో సంభవించిన రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా యువకులే ఉన్నారని పేర్కొన్నారు. ఈసంవత్సరం 91మంది రోడ్డు ప్రమాదాల బారిన పడి మరణిస్తే అందులో 40 మందికి పైగా 35 ఏళ్లలోపు యువకులు ఉన్నారని తెలిపారు. ఈ గణాంకాలు ఆందోళన కలిగించే విషయం అని పేర్కొన్నారు. యువకులు సరదా కోసం వాహనాలు నడపడం, వేగంగా వెళ్లడం, రైడ్స్ నిర్వహించడం లాంటి వాటికి దూరంగా ఉండాలని, సరదా కోసం ప్రమాదాల బారిన పడొద్దని కోరారు. పోలీసు శాఖ ఎన్ని భద్రత చర్యలు తీసుకున్నా వ్యక్తిగత రక్షణ ఉండాలని, వాహనాలు నడిపేటప్పుడు నియంత్రణలో ఉండాలని సూచించారు. అధిక వేగంతో వాహనాలు నడపవద్దని, మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. రాంగ్ రూట్‌లో వాహనాలు నడపవద్దని విజ్ఞప్తి చేశారు. ఇన్సూరెన్స్, లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని కోరారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో గురువారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం జరిపారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా ముస్తాబుచేసి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. కల్యాణ తంతు నిర్వహించి శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఉత్సవమూర్తులను ఆలయ ప్రవేశం గావించి నీరాజన మంత్రపుష్పాలతో మహా నివేదన చేశారు. ఈ కార్యక్రమంలో మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, క్రిష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థి గెలుపు ఖాయం



తిరుమలగిరిలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

తిరుమలగిరి (తుంగతుర్తి) : భువనగిరి లోక్ సభ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి ఎం.డి.జహంగీర్ అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం తిరుమలగిరిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ , సీపీఎం మధ్యనే పోటీ ఉంటుందని ఆయన తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలుంటే దేశం ఐక్యంగా ముందుకు పోతుందని, ప్రజల మధ్యన ఐక్యత పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ ఐక్యతను దెబ్బ తీయడానికి కేంద్రంలోని బీజేపీ సర్కార్.. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా అమ్ముతోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలంటే బీజేపీని ఓడించాలని అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేళ్ల కాలంలో దళితులు, గిరిజనులు, మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి నాగార్జున్‌రెడ్డి, పార్టీ అభ్యర్థి ఎం.డి.జహంగీర్, నెమ్మాని వెంకటేశ్వర్లు, యాదగిరిరావు, సైదులు, గోపి, రమేష్, సత్యం, రజిత, ఉప్పలయ్య, శ్రీనివాస్, లింగయ్య, సోమయ్య, యాదగిరి పాల్గొన్నారు.

ఉదయ సముద్రానికి నీటి నిలిపివేత

పెద్దఅడిశర్లపల్లి : ఏఎమ్మార్పీ నుంచి నల్లగొండలోని ఉదయ సముద్రానికి నీటి విడుదలను గురువారం అధికారులు నిలిపివేశారు. ఈ నెల 2 నుంచి అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ప్రధాన కాలువ ద్వారా 1100 క్యూసెక్కులు నీటిని విడుదల చేయగా.. నాగార్జున సాగర్ నీటిమట్టం కనిష్ఠ స్థాయి దిగువకు పడిపోవడంతో నీటిని నిలిపివేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. సాగర్ వెనుక జలాల నుంచి 800 క్యూసెక్కుల నీటిని లింక్ కెనాల్ ద్వారా ఏకేబీఆర్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి మెయిన్ కెనాల్ ద్వారా హైదరాబాద్ జంట నగరాలకు 525 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 45 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఈఈ జీజేవీ.సత్యనారాయణ తెలిపారు.

తొలిరోజు నలుగురు

లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల .. మొదలైన నామినేషన్ల పర్వం

- నల్లగొండలో నలుగురు అభ్యర్థులు.. ఆరు సెట్ల నామినేషన్లు దాఖలు
- బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డి తరఫున ఆ పార్టీ నాయకుల నామినేషన్
- ఇతర పార్టీల నుంచి ఇద్దరు, స్వతంత్ర అభ్యర్థిగా ఒకరు..



బీజేపీ నల్లగొండ అభ్యర్థి సైదిరెడ్డి తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న ఆ పార్టీ నాయకులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : లోక్‌సభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం నోటిఫికేషన్ జారీ చేయడంతో ఎన్నికల పోరు మొదలైంది. జిల్లా కలెక్టర్, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల అధికారి కలెక్టర్ హరిచందన లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. నామినేషన్ల ఘట్టం ప్రారంభం కావడంతో తొలిరోజు నలుగురు అభ్యర్థులు ఆరుసెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన కలెక్టరేట్‌లో నామినేషన్ పత్రాలు స్వీకరించారు.



ఆరు సెట్ల నామినేషన్లు దాఖలు

నల్లగొండ లోక్‌సభ స్థానానికి మొదటి రోజైన గురువారం నలుగురు అభ్యర్థులు ఆరు సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించారు. బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి తరఫున ప్రతిపాదకుడు మాదగోని శ్రీనివాసగౌడ్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు బండారు ప్రసాద్, ఇతర నాయకులు ఉన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ స్వతంత్ర అభ్యర్థిగా రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా తరఫున రచ్చ సుభద్రారెడ్డి ఒక సెట్, ప్రజావాణి పార్టీ తరఫున లింగిడి వెంకటేశ్వర్లు రెండు సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారు.

25వ తేదీ వరకు స్వీకరణ

ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుంది. 26వ తేదీన నామినేషన్ల పరిశీలన, 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం జరగనుంది. ఆ తర్వాత అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటించడంతో పాటు రంగంలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించనున్నారు.

కనిపించని సందడి..

తొలిరోజు రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద ఎన్నికల సందడి పెద్దగా కనిపించలేదు. కాగా నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆర్వో కార్యాలయం ఉన్న కలెక్టరేట్ భవనం గేటు వద్ద పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. గేటు వద్ద బారికేడ్లను ఏర్పాటు చేసి నామినేషన్‌ల సమయం ముగిసే వరకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఇతరులు ఎవరినీ లోపలికి అనుమతించలేదు

భువనగిరి పరిధిలో ముగ్గురు..



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ప్రజావాణి పార్టీ అభ్యర్థి లింగిడి వెంకటేశ్వర్లు

భువనగిరి లోక్‌సభ స్థానానికి తొలిరోజు ముగ్గురు అభ్యర్థులు నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ఎన్నికల అధికారి హనుమంత్ కె. జెండగే నామినేషన్లు స్వీకరించారు. స్వతంత్ర అభ్యర్థులు బేతి నరేందర్ ఒక సెట్, మర్రి స్వామి ఒక సెట్, ప్రజావాణి పార్టీ అభ్యర్థిగా లింగిడి వెంకటేశ్వర్లు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ప్రధాన పార్టీలు అభ్యర్థులను ప్రకటించినా.. వారిలో ఎవరూ గురువారం నామినేషన్ వేయలేదు. అభ్యర్థులు మంచి ముహూర్తం చూసుకుని ముఖ్య నాయకులతో కలిసి నామినేషన్లు వేయడానికి సిద్ధమవుతున్నారు.

బీఆర్‌ఎస్ దుకాణం మూతపడింది



ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, హాజరైన కార్యకర్తలు

- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

కోదాడ: రాష్ట్రంలో పదేళ్లు నియంతృత్వ పాలన చేసిన బీఆర్‌ఎస్ దుకాణం ఎన్నికలు జరిగిన వంద రోజుల్లోనే మూత పడిందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం కోదాడలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 14 నుంచి 15 స్థానాల్లో విజయం సాధిస్తుందని, ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, భువనగిరి స్థానాల్లో రికార్డు స్థాయి మెజార్టీతో విజయం సాధించబోతున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వీర సైనికుల్లా పని చేసి పార్టీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు రాష్ట్రంలో దోచుకోవడం, దాచుకోవడం మీదే దృష్టి పెట్టారని తాము మాత్రం గెలిచిన మరుక్షణం నుంచి ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నామని ఆయన చెప్పారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల కంటే అధిక మెజార్టీ సాధించాలన్నారు. దానికి అనుగుణంగా మే 13 వ తేదీ వరకు ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని ఆయన కోరారు. కోదాడ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మార్చే బాధ్యత తనదేనని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న ఉభయ కమ్యూనిస్టు పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవడం అభినందనీయమని , వారికి కూడా తగిన ప్రాధాన్యమిస్తామని మంత్రి ఉత్తమ్ తెలిపారు.

సీనియర్ సిటిజన్స్‌ను ఆదుకుంటాం



పెన్షనర్స్ భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

కాంగ్రెస్ ప్రభుత్వ సీనియర్ సిటిజన్స్‌కు అండగా నిలుస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం కోదాడ పెన్షనర్స్ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ ఫ్రెండ్లీగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్క రిటైర్డ్ ఉద్యోగి పని చేయాలని కోరారు. మంత్రిని వారు ఘనంగా సన్మానించారు. కోదాడ పట్టణ అధ్యక్షుడు వంగవేటి రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోదాడ, సాగర్ ఎమ్మెల్యేలు పద్మావతిరెడ్డి, జైవీర్‌రెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, డీసీసీ అధ్యక్షులు శంకర్‌నాయక్, చెవిటి వెంకన్న యాదవ్, అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎంపీపీలు యలకా బిందు, ఆశా శ్రీకాంత్‌రెడ్డి, మల్లెల రాణి, జెడ్పీటీసీలు కృష్ణకుమారి, బాణాల కవిత నాగరాజు, నేతలు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ఎర్నేనిబాబు, డాక్టర్ బట్టు శ్రీహరి, పందిరి నాగిరెడ్డి, బుర్రా సుధారాణి, ప్రమోద్‌రెడ్డి, అల్తాఫ్ హుస్సేన్, పారా సీతయ్య, చింతలపాటి శ్రీనివాస్, ఈదుల కృష్ణయ్య, రామినేని శ్రీనివాసరావు, బషీర్, మాతంగి బసవయ్య, ఎజాజ్, బాగ్దాద్, భాజాన్, దేగబాబు, సీపీఐ నాయకులు గన్నా చంద్రశేఖర్, బెజవాడ వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకుడు వెంకటరెడ్డి, సీనియర్ సిటిజన్స్ రావెళ్ల సీతరామయ్య, బొల్లు రాంబాబు పాల్గొన్నారు.

21న బాస్కెట్ బాల్ క్రీడాకారుల ఎంపిక

సూర్యాపేట టౌన్ : సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 21 జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు హఫీజ్ ఖాన్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గాదరి కిషోర్ కుమార్, ఉపాధ్యక్షుడు పుట్టా కిషోర్ గురువారం తెలిపారు. జిల్లాస్థాయి సెలక్షన్‌కు అండర్ 18 క్రీడాకారులు అర్హులని పేర్కొన్నారు. 2006 జనవరి 1వతేదీ తరువాత పుట్టిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. 25, 26, 27 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఈ సెలక్షన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాణించాలని సూచించారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభగల క్రీడాకారులను గుర్తించి వారికి సరైన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : అమ్మ ఆదర్శ పాఠశాల్లో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు ఆదేశించారు. గురువారం వెబెక్స్ ద్వారా కాన్ఫరెన్స్ నిర్వహించి డీఈఓ, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, నోడల్ ఆఫీసర్లతో మాట్లాడారు. బూత్‌లు ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను పోలింగ్ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలల కరెంటు బిల్లులను బడుల నిధుల ద్వారా చెల్లించాలన్నారు. ఎంఈఓలు, పాఠశాలల హెచ్‌ఎంలు పిల్లలకు అత్యవసరమైన చిన్నచిన్న పలులు పూర్తి అయ్యే విధంగా చూసుకోవాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పర్యవేక్షించి కావాల్సిన అత్యవసరమైన పనులను త్వరగా పూర్తి అయ్యేలా కమిటీలతో చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్‌ఎం మొబైల్ యాప్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని పని పురోగతిని ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని, ప్రతిరోజు ఫొటోలను కూడా యాప్‌లో పెట్టాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలకు 23వ తేదీ నుంచి వేసవి సెలవులు వస్తున్నందున పోలింగ్ కేంద్రాలు ఉన్న పాఠశాలల తాళాలను పంచాయతీ సెక్రటరీలకు అందజేయాలని హెచ్‌ఎంలను కోరారు. సమావేశంలో డీఈఓ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

ఇవీ.. నా రెండు ఆప్షన్లు

- సీఎంఆర్ ఇవ్వడంపై కలెక్టర్‌కు లేఖ రాసిన కోదాడ మిల్లర్
- రెండింటిలో మీ ఇష్టమైనది ఎంచుకోవాలని సూచన
- సామాజిక మాధ్యమాల్లో లేఖ విడుదల
- చర్చనీయాంశంగా మిల్లర్ తీరు
- సీఎంఆర్ ధాన్యం పక్కదారి పట్టడంపై మంత్రి ఉత్తమ్ సీరియస్



కలెక్టర్‌కు నీల సత్యనారాయణ రాసిన లేఖ

కోదాడ : కోట్ల రూపాయల సీఎంఆర్ ధాన్యాన్ని పక్కదారి పట్టించిన కోదాడ రైస్ మిల్లర్ ఆ బియ్యాన్ని తాను ఇవ్వాలంటే తన వద్ద రెండు ఆప్షన్లు ఉన్నాయని వాటిలో మీకు ఇష్టమైనదానిని ఎంచుకోవాలని ఏకంగా కలెక్టర్‌కు లేఖ రాయడమే కాకుండా దానిని సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో పాటు కొంత మంది పోలీస్ అధికారులకు కూడా పంపడం పట్టణంలో సంచలనంగా మారింది. నాలుగు నెలల క్రితం ఇదే మాదిరిగా లేఖలను రాయడమే కాకుండా నాటి ఎంపీ, ప్రస్తుత మంత్రి ఉత్తమ్ తనకు సీఎంఆర్ ధాన్యం ఇవ్వమని రికమండ్ చేసినట్లు ఓ నకిలీలేఖను కూడా విడుదల చేయడం, దానిపై కొందరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు కూడా నమోదైన విషయం విదితమే. తాజాగా కోదాడ మిల్లర్‌పై ప్రభుత్వ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైన ఈ సమయంలో మరోసారి కలెక్టర్‌కు లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది.

రెండు ఆప్షన్లలో మీ ఇష్టమైనదానిని ఎంచుకోండి..

కోదాడకు చెందిన శ్రీ వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ ప్రభుత్వానికి 2022–23 వానాకాలం, యాసంగి, 2023–24 వానాకాలం సీజన్‌కు సంబంధించి సుమారు రూ.65 కోట్ల విలువైన బియ్యం ఇవ్వాల్సి ఉంది. దీనిపై అధికారులు పలుమార్లు ఒత్తిడి తెచ్చినా ఇవ్వకుండా తప్పించుకుంటూ వస్తున్నారు. ఈక్రమంలో మంగళవారం విజిలెన్స్ అధికారులు మిల్లుపై దాడులు నిర్వహించి మిల్లు యజమాని నీల సత్యనారాయణ ఇతర భాగస్వాములపై కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 97/2024తో కేసు నమోదు చేశారు. మిల్లు యజమాని పరారీలో ఉన్నాడు. ఈ క్రమంలో బుధవారం సదరు మిల్లర్‌కు చెందిన కొందరు సామాజిక మాధ్యమాల్లో జిల్లా కలెక్టర్‌కు నీల సత్యనారాయణ గత నెల 22న రాసిన ఓ లేఖను పెట్టారు. తాను ప్రభుత్వానికి బకాయి పడిన బియ్యాన్ని ప్రస్తుతం ఇచ్చే పరిస్థితి లేదని చెప్పడంతో పాటు తన వద్ద రెండు ఆప్షన్లు ఉన్నాయని వాటిలో మీ ఇష్టమైన దాన్ని ఎంచుకోవాలని కోరారు. మొదటి ఆప్షన్ ప్రకారం 2025 మార్చి వరకు తనకు సమయం ఇస్తే విడతల వారీగా బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగిస్తానని పేర్కొన్నాడు. ఇది ఇష్టం లేకపోతే తాను ఇవ్వాల్సిన మొత్తం బకాయిలను ఆరు భాగాలుగా చేస్తే ఆరు సీజన్లలో అంటే మూడేళ్లలో మొత్తం బియ్యాన్ని అప్పగిస్తానని తెలిపాడు. ఈ లేఖను కొందరు పోలీస్ అధికారులకు కూడా పంపడంతో వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు లేఖలను అధికారులకు నేరుగా ఇవ్వాలని ఇలా సామాజిక మాధ్యమాల్లో పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు సమాచారం.

మంత్రి ఉత్తమ్ తీవ్ర ఆగ్రహం

జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) పక్కదారి పట్టడంపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ అధికారుల ఆదేశించినట్లు తెలిసింది. ప్రభుత్వం కోట్ల రూపాయలు అప్పుగా తెచ్చి ధాన్యం కొనుగోలు చేసి మిల్లర్లకు అప్పగిస్తే సంవత్సరాల తరబడి బియ్యం ఇవ్వకుండా ధాన్యాన్ని పక్కదారి పట్టించడంపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. గత ప్రభుత్వం హయాంలో మిల్లర్లు, నాయకులు కలిసి దందా చేశారని దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని, సీఎంఆర్ ప్రతి గింజను మిల్లర్ల నుంచి వసూలు చేయాలని ఆయన అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

మిల్లర్ కోసం పోలీసుల వేట

కోదాడలోని వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ యజమాని నీల సత్యనారాయణ, భాగస్తులు కొత్తూరు సత్యనారాయణపై కోదాడ రూరల్ స్టేషన్‌లో కేసునమోదు కావడంతో ఆయనను అదుపులో తీసుకోవడానికి పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నారు. కోదాడలోని ఆయన ఇంటి వద్ద, హైదరాబాద్‌లోని నివాసం వద్ద పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు సమాచారం. జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరిపై క్రైం నంబర్ 97/2024 అండర్ సెక్షన్ ఆఫ్ ఐపీసీ 406, 409,420 రెడ్ విత్ 34 ఐపీసీ కింద కేసులు నమోదు చేశారు.

రైస్ మిల్లుపై అధికారుల దాడులు



నాగారం మండలం ప్రగతినగర్‌లోని రాఘురామ రైస్ ఇండస్ట్రీలో రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

నాగారం : సీఎంఆర్ ధాన్యాన్ని పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు రావడంతో నాగారం మండలంలోని ప్రగతినగర్ వద్ద ఉన్న రాఘురామ రైస్ ఇండస్ట్రీపై గురువారం డీఎస్‌ఓ మోహన్‌బాబు, ఆర్డీఓ వేణుమాధవరావుల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 2022–23 యాసంగి, 2023–24 వానాకాలం సీజన్లలో మిల్లుకు కేటాయించిన సీఎంఆర్ ధాన్యం నిల్వలను తనిఖీ చేశారు. మిల్లుకు కేటాయించిన ధాన్యానికి, ప్రస్తుతం అక్కడ ఉన్న స్టాక్ వివరాలకు వ్యత్యాసం ఉన్నట్లు తనిఖీల్లో తేలడంతో రికార్డులను స్వాధీనం చేసుకొని ఉన్నతాధికారులకు అప్పగించనున్నట్లు తెలిసింది. కాగా అధికారులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. పూర్తి వివరాలను జిల్లా ఉన్నతాధికారులు వెల్లడిస్తామని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంసీఎస్, డీపీఓ, జెడ్పీసీఈఓ, అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

31,975 మందికి టెస్టులు

- ఏడాదిగా 'ఆరోగ్య మహిళా' కింద అతివలకు పరీక్షలు
- ఐదు కేంద్రాల్లో సజావుగా కొనసాగుతున్న కార్యక్రమం
- తీవ్ర రుగ్మతలుంటే జిల్లా కేంద్ర ఆస్పత్రికి రెఫర్



త్రిపురవరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి (ఫైల్)

తిరుమలగిరి (తుంగతుర్తి): ప్రస్తుత సమాజంలో జీవన శైలిలో వస్తున్న మార్పుల కారణంగా మహిళలు వివిధ సమస్యలతో అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆరోగ్య మహిళా పథకం ద్వారా వివిధ రకాల పరీక్షలు ఉచితంగా చేస్తూ వారిలోని వ్యాధులను గుర్తించి సరైన చికిత్స అందిస్తూ అతివల ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తోంది. దీంట్లో భాగంగా గతేడాది ఏప్రిల్ గతనెల మార్చి వరకు ఏడాది కాలంగా 31,975 మంది మహిళలకు అన్ని రకల వైద్య పరీక్షలు చేసి కొందరికి అవసరమైన చికిత్స చేయగా మరికొందరిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి రిఫర్ చేశారు.

పరీక్షలతో వ్యాధుల గుర్తింపు

జిల్లా వ్యాప్తంగా ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా పథకం కింద కేవలం మహిళలకే వైద్య సేవలు అందిస్తున్నారు. జిల్లాలో ఎంపిక చేసిన ఐదు పీహెచ్‌సీల్లో వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఆయా సెంటర్లకు వచ్చిన మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు వారిలో తీవ్ర రుగ్మతలుంటే వారిని గుర్తించి పెద్దాస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. మంచి స్పందన ఉండడంతో కొన్ని కేంద్రాల్లో గురువారం సైతం పరీక్షలు నిర్వహిస్తున్నారు.

మూడు విభాగాల్లో ..

ఈ క్రమంలో ఆరోగ్య కేంద్రాల్లో మూడు విభాగాల్లో వ్యాధిగ్రస్తుల వివరాలు నమోదవుతున్నాయి. ముందుగా ల్యాబ్‌లో ఆధార్, ఫోన్ నంబర్ నమోదు చేస్తారు. అక్కడే షుగర్, బీపీ పరీక్షలు చేస్తారు. బరువు, ఎత్తు కొలతలు తీస్తారు. రెండవ విభాగంలో వైద్యాధికారి వ్యాధుల లక్షణాలు, సమస్యలు తెలుసుకుంటారు. అనంతరం అనుమానితుల నుంచి రక్త, మూత్ర నమూనాలను సేకరిస్తారు. పరీక్షల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. థైరాయిడ్, క్యాన్సర్, ఇతర రోగాల స్క్రీనింగ్, సూక్ష్మ పోషక లోపాల గుర్తింపు, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు, హార్మోన్ల అసమతుల్యత, మోనోపాస్, శరీర బరువు ఇలా 8 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. రక్త నమూనాలను సేకరించి టీడయాగ్నస్టిక్ కేంద్రాలకు తరలిస్తున్నారు. క్యాన్సర్, స్క్రీనింగ్ పరీక్షలు కూడా జరుగుతుండగా అనుమానితులు, లక్షణాలు ఉన్న వారి బయోప్సీ, మెమోగ్రామ్, ఇతర పరీక్షల కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రికి సిఫార్సు చేస్తున్నారు. ప్రస్తుతం ఐదు పీహెచ్‌సీల్లోనే ఆరోగ్య మహిళా కార్యక్రమం కొనసాగుతుండడంతో అంతటా అమలు చేయాలని మారుమూల ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

ఆరోగ్య మహిళా పథకం కింద చేసిన పరీక్షల వివరాలు

పీహెచ్‌సీ	సాధారణపరీక్షలు	రొమ్ముక్యాన్సర్	గర్భసంచి	మూత్రాశయ	థైరాయిడ్	రిఫరల్ కేసులు
త్రిపురవరం	3,011	1,708	993	57	12	435
నేరేడుచర్ల	2,834	2,632	116	28	252	166
నూతనకల్	2,969	2,794	288	303	98	327
పెన్‌పహాడ్	3,013	2,802	296	425	34	190
కుడకుడ	2,886	2,538	258	98	103	309
మొత్తం	14,713	12,474	1951	911	499	1427

ఐదు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నాం



ప్రస్తుతం జిల్లాలో మహిళా వైద్యులు, నిపుణులు ఉన్న ఐదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య మహిళా కార్యక్రమం అమలవుతుంది. ప్రతి మంగళవారం ఈ కార్యక్రమం చేపట్టి మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్నాం. మరికొన్ని కేంద్రాల్లో అమలు చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదించాం.

– డాక్టర్ కోటాచలం,
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

సాక్షి తెలంగాణ
ఎలక్షన్ 2024

● నామినేషన్లు షురూ..


భువనగిరిటౌన్: భువనగిరి లోక్‌సభ స్వతంత్ర అభ్యర్థిగా గురువారం యాదాద్రి కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న బేతి నరేందర్


భువనగిరిటౌన్: భువనగిరి లోక్‌సభ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న మర్రి స్వామి


నల్లగొండ లోక్‌సభ స్వతంత్ర అభ్యర్థిగా గురువారం నల్లగొండ కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్


నల్లగొండ లోక్‌సభకు సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న రచ్చ సుభద్రారెడ్డి


నల్లగొండ లోక్‌సభకు ప్రజావాణి పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న లింగిడి వెంకటేశ్వర్లు

‘భువనగిరి’ వ్యయ పరిశీలకుల నియామకం

సాక్షి యాదాద్రి: భువనగిరి లోక్‌సభ నియోజకవర్గానికి ఎన్నికల వ్యయ పరిశీలకులను ఎన్నికల సంఘం నియమించింది. ఇబ్రహీంపట్నం, మునుగోడు, భువనగిరి అసెంబ్లీ సెగ్మెంట్లకు రాకేష్‌కుమార్ రంజన్, నకిరేకల్, ఆలేరు, జనగామ, తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలకు సాయన్‌దేబర్మ వ్యయ పరిశీలకులుగా వ్యవహరించనున్నారు.

‘నల్లగొండ’ పరిశీలకుడిగా కళ్యాణ్‌కుమార్ దాస్


కళ్యాణ్‌కుమార్ దాస్‌కు స్వాగతం పలుకుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ: నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడిగా కళ్యాణ్‌కుమార్ దాస్‌ను కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. గురువారం నల్లగొండ పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో కళ్యాణ్‌కుమార్ దాస్‌కు నల్లగొండ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. కళ్యాణ్‌కుమార్‌దాస్ 81214 46758 ఈ ఫోన్ నంబర్‌లో అందుబాటులో ఉండనున్నారు.

ప్రజల చేతిలో అస్త్రం..

సీ–విజిల్


భువనగిరి కలెక్టరేట్‌లో సీ-విజిల్ యాప్‌పై అవగాహన పోస్టర్

- ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేసేందుకు వీలుగా యాప్ రూపకల్పన
- ఫిర్యాదు అందిన 5 నిమిషాల్లోనే రంగంలోకి ఫ్లయింగ్ స్క్వాడ్
- 100 నిమిషాల్లో ఫిర్యాదుకు పరిష్కారం
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

భువనగిరిటౌన్: ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేసేందుకు సీ-విజిల్ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే ఫొటో, వీడియో, ఆడియో ఏదైనా రికార్డు చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ద్వారా ఫిర్యాదు అందిన 5 నిమిషాల్లోనే ఈ సమాచారాన్ని సంబంధిత ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ టీంకు పంపుతారు. ఈ టీం 15 నిమిషాల్లో ఆ ప్రాంతానికి వెళ్లి 30 నిమిషాల్లో విచారణ పూర్తి చేసి నివేదికను ఎన్నికల అధికారికి చేరవేస్తారు. ఈ నివేదికపై సంబంధిత ఎన్నికల అధికారులు 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. మొత్తం వంద నిమిషాల్లో సీ-విజిల్ యాప్‌లో అందిన ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటారు. అదేవిధంగా ఫిర్యాదు స్టేటస్ తెలుసుకునే వెసులుబాటు కూడా యాప్‌లో ఉంది. అలాగే వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారమయ్యే వ్యతిరేక కథనాలపై కూడా కంట్రోల్ రూం నుంచి చర్యలు తీసుకుంటారు.

రిజిస్టర్ చేసుకోండిలా..

గూగుల్ ప్లే స్టోర్‌లో సీ-విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. సెల్‌ఫోన్ నంబర్ ద్వారా యాప్‌లో రిజిస్టర్ చేసుకోగానే, ఫోన్‌కు ఓటీపీ నంబర్ వస్తుంది. దానిని నమోదు చేసిన వెంటనే సీ-విజిల్ యాప్‌ను ఉపయోగించుకోవచ్చు.

ఎలాంటి ఫిర్యాదులు చేయవచ్చంటే..

ఎన్నికల్లో డబ్బు పంపకాలు, ఉచితంగా వస్తువులు, బహుమతులు ఇవ్వడం, రెచ్చగొట్టే ప్రసంగాలు, ప్రకటనలు చేయడం, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం వంటి ఉల్లంఘనలను ఫొటో, వీడియో, ఆడియో రికార్డు చేసి అప్‌లోడ్ చేయవచ్చు.


భువనగిరి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం

ఎలా చేయాలంటే..

సెల్‌ఫోన్‌లో సీ-విజిల్ యాప్ ఓపెన్ చేయగానే స్క్రీన్‌పై ఫొటో, వీడియో, ఆడియో అనే మూడు ఆప్షన్లు ఉంటాయి. ఇందులో మీ వద్ద ఏ ఆధారం ఉంటే ఆ ఆప్షన్‌ను ఎంపిక చేసుకుంటే మీ లోకేషన్ నమోదవుతుంది. ఉల్లంఘనకు సంబంధించిన ఆధారాన్ని అప్‌లోడ్ చేయాలి. ఏ రాష్ట్రం, ఏ నియోజకవర్గం తదితర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. అలాగే సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరిస్తే ఈ ఫిర్యాదు నేరుగా ఎన్నికల సంఘానికి చేరుతుంది. ఎస్ఈసీకి చేరిన ఈ ఫిర్యాదును అక్కడి అధికారులు వెంటనే సంబంధిత ఎంసీసీ కంట్రోల్ రూంకు చేరవేస్తారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు వెంటనే చర్యలకు ఉపక్రమిస్తారు



మీలో ఒకడిని..

ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఉదయం మిర్యాలగూడ పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద కూలీలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్. - మిర్యాలగూడ



‘గుర్తు’ంచుకోండి..

భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు గురువారం రామన్నపేట మండల కేంద్రంతో పాటు వెల్లంకి తదితర గ్రామాల్లో కమలం పువ్వు గుర్తులతో ప్రచారం నిర్వహించారు. - రామన్నపేట

బీ-ఫాం అందుకున్న బీఆర్ఎస్ అభ్యర్థులు


బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నుంచి బీ-ఫాం అందుకుంటున్న నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి


కేసీఆర్ చేతులమీదుగా బీ-ఫాం అందుకుంటున్న భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్

నల్లగొండ టూటౌన్: బీఆర్ఎస్ నల్లగొండ, భువనగిరి ఎంపీ అభ్యర్థులు కంచర్ల కృష్ణారెడ్డి, క్యామ మల్లేష్ గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పార్టీ అధినేత కేసీఆర్ నుంచి బీ-ఫాం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు ఎన్. భాస్కరరావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్, చిరుమర్తి లింగయ్య, గొంగిడి సునీత, పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22లోగా ఫారం-12 సమర్పించాలి

- నల్లగొండ కలెక్టర్ హరిచందన

నల్లగొండ : పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగులు ఈ నెల 22లోగా ఫారం–12 సమర్పించాలని నల్లగొండ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హరిచందన పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులకు నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు మాత్రమే పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం ఉంటుందన్నారు. 22వ తేదీ తర్వాత సమర్పించే ఫారాలు పరిగణనలోకి తీసుకోమని తెలిపారు. హోమ్ ఓటింగ్‌లో పాల్గొననున్న వృద్ధులు, వికలాంగులు కూడా ఈ నెల 22వ తేదీలోగా ఫారం–12డి సమర్పించాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ డి.రాజ్యలక్ష్మి, పోస్టల్ బ్యాలెట్ జిల్లా నోడల్ అధికారి శ్రీదేవి, జిల్లా ఎన్నికల శిక్షణ రిసోర్స్ పర్సన్ తరాల పరమేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

ఈవీఎంల తరలింపు


ఈవీఎంల తరలింపును పరిశీలిస్తున్న సూర్యాపేట కలెక్టర్ వెంకటరావు, ఎస్పీ రాహుల్

సూర్యాపేట: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మొదటి ర్యాండమైజేషన్ అనంతరం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను తరలించినట్లు సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకటరావు తెలిపారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలోని గోదాములో ఈవీఎంల తరలింపు ప్రక్రియను జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్లు సీహెచ్.ప్రియాంక, బీఎస్ లతతో కలిసి కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా 25 శాతం రిజర్వ్‌డ్‌తో బ్యాలెట్ యూనిట్లు 1500, కంట్రోల్ యూనిట్లు 1500, 40 శాతం రిజర్వ్‌డ్‌తో 1,680 వీవీ ప్యాట్‌లను ఏఆర్‌ఓల ఆధ్వర్యంలో తరలించినట్లు వివరించారు. ఆయా నియోజకవర్గాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లలో వాటిని భద్రపర్చి ఆ తర్వాత రెండో ర్యాండమైజేషన్ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓలు , ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాసరాజు, తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిఘా కట్టుదిట్టం చేశాం

- సూర్యాపేట ఎస్పీ రాహుల్‌హెగ్డే

సూర్యాపేట: లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో సూర్యాపేట జిల్లాలో నిఘా కట్టుదిట్టం చేసినట్లు ఎస్పీ రాహుల్‌హెగ్డే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేస్తామని, ఉల్లంఘనలకు పాల్పడితే చట్ట ప్రకారం కేసులు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో రాజకీయ పార్టీల అభ్యర్థులు, కార్యకర్తలు, ప్రజలు, పౌరులు ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని సూచించారు.

కేసీఆర్ కుటుంబం జైలుకెళ్లడం ఖాయం

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న రాజగోపాల్ రెడ్డి

మునుగోడు: పదేళ్ల పాటు రాష్ట్రంలో నియంత పాలన కొనసాగించి, లక్షల కోట్లు కాజేసిన కేసీఆర్ కుటుంబం అంతా జైలుకు వెళ్లడం ఖాయమని భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గురువారం మునుగోడులో నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అతి త్వరలో రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగు కావడం ఖాయమని, పార్లమెంట్ పరిధిలోని ఆ పార్టీ నేతలు అంతా కాంగ్రెస్ పార్టీ కండువాలు జేబులో పెట్టుకొని పార్టీలో చేర్చుకోమంటూ తమను బతిమిలాడుతున్నారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీచేసేందుకు నాయకులు ముందుకు రావడం లేదన్నారు. అది తెలియక కేసీఆర్ మూడు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వాని కూల్చివేస్తాని ప్రగల్భాలు పలుకుతున్నాడన్నారు. 10 ఏళ్లపాటు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందన్నారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో బీజేపీకి ఓట్లు లేవని, అది తెలియక ఆ పార్టీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ తానే గెలుస్తానని గొప్పలు చెప్పుకుంటున్నాడన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి కిరణ్ కుమార్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానన్నారు. తాను ఎంపీగా గెలిచిన తరువాత ఆయన అడుగు జాడల్లో నడుస్తానన్నారు. సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, మల్‌రెడ్డి రాంగారెడ్డి, వేముల వీరేశం, మందుల సామేల్, నల్లగొండ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్‌నాయక్, సంజీవ రెడ్డి, చెవిటి వెంకన్న, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, పున్న కైలాస్‌నేత, దొడ శ్రీనివాస్‌రెడ్డి, నారబోయిన రవి, ఏలుగోటి వెంకటేశ్వర్ రెడ్డి, తాడూరి వెంకట్ రెడ్డి, వెన్‌రెడ్డి రాజు, గుత్త ఉమ పాల్గొన్నారు.

రేవంత్ బూట్లు తుడిచేందుకు పోటీపడుతున్న కోమటిరెడ్డి బ్రదర్స్

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి


నల్లగొండలో మీడియాతో మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: రేవంత్‌రెడ్డి వచ్చి తెలుగు కాంగ్రెస్‌గా మార్చిండని తీవ్రంగా ఆరోపణలు చేసిన కోమటిరెడ్డి బ్రదర్స్ ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి బూట్లు తుడిచేందుకు పోటీ పడుతున్నారని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం నల్లగొండకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. పదవి పోకుండా ఉండేందుకు అన్న, మంత్రి పదవి కోసం తమ్ముడు పోటీపడుతూ కేసీఆర్‌పై విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జిని సైతం తిట్టిన ఈ దుర్మార్గులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో రూ. 20 వేల కోట్లకు కాంగ్రెస్‌ను బీజేపీకి తాకట్టు పెట్టిన చరిత్ర వీరిదని పేర్కొన్నారు. అన్న వెంకట్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఉండి బీజేపీకి ఓటేయమన్నారని దుయ్యబట్టారు. నోటికొచ్చినట్లు బూతులు మాట్లాడుతూ అసలు సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. చేతకాని దద్దమ్మలు, బ్యాంకులను మోసం చేసిన దొంగలు వీళ్లని ఆరోపించారు. మోదీని రాహుల్ వ్యతిరేకిస్తుంటే రేవంత్‌రెడ్డి బడేభాయ్ అంటున్నారని, ఎప్పటికైనా ఛోటేభాయ్ బడేభాయ్ దగ్గరికి వెళ్తాడని ఆపార్టీ వారే చెబుతున్నారని వ్యాఖ్యానించారు. ఆస్తుల గురించి మాట్లాడుతున్న కోమటిరెడ్డి బ్రదర్స్ ఎవరి బతుకు ఏంటో అందరికీ తెలుసన్నారు. మీడియా మిత్రులు మా ఊరికి వెళ్లి మా మూలాలు, కోమటిరెడ్డి వాళ్ల ఊరికి వెళ్లి వాళ్ల మూలాలు, రెవెన్యూ రికార్డులు చూడవచ్చన్నారు. లక్ష రూపాయల కళ్లజోడు, లక్ష రూపాయల గడియారం పెట్టుకొని జూబ్లీహిల్స్ పబ్స్‌లో ఫోజులు కొడుతున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్‌పై అవాకులు, చవాకులు మాట్లాడితే ప్రజలు బట్టలు ఊడదీసి కొడతారని హెచ్చరించారు. ఆయన వెంట నల్లగొండ జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గురుకుల విద్యార్థినులకు అస్వస్థత


నేరేడుచర్ల పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

నేరేడుచర్ల: మండలంలోని చిల్లేపల్లి గ్రామ పరిధిలో గల బీసీ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం నలుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న లావణ్య, సంజన, వసంతరాణి, ప్రణీత తెల్లవారుజామున వాంతులు చేసుకున్నారు. దీంతో పాఠశాల క్రాఫ్ట్ టీచర్(హాస్టల్ ఇన్‌చార్జి) భరణి వాంతులు తగ్గేందుకు విద్యార్థినులకు మందులు ఇచ్చింది. అయినప్పటికీ విద్యార్థినులకు వాంతులు తగ్గకపోవడంతో సాయంత్రం 4గంటలకు నేరేడుచర్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అప్పటికే విధులు పూర్తిచేసుకొని వైద్యాధికారి నాగిని ఆస్పత్రి నుంచి వెళ్లిపోయింది. ఆస్పత్రి సిబ్బంది వాంతులు తగ్గేందుకు వైద్యాధికారిని సలహా మేరకు మందులు ఇచ్చారు. అయినా విద్యార్థినులు మరో రెండు సార్లు వాంతులు చేసుకున్నారు. కొద్దిసేపటి తరువాత ఆరోగ్యం కుదుటపడటంతో ఇద్దరు విద్యార్థినులను వారి తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లగా.. మరో ఇద్దరు విద్యార్థినులను హుజూర్‌నగర్‌లో ఉంటున్న వారి తల్లిదండ్రులకు అప్పగించేందుకు హాస్టల్ ఇన్‌చార్జి భరణి ఆటోలో తీసుకెళ్లారు. విద్యార్థినుల అస్వస్థతకు గల కారణం గురించి హాస్టల్ ఇన్‌చార్జి భరణిని అడుగగా.. ఈ నలుగురు మాత్రమే వాంతులు చేసుకున్నారని, మిగిలిన విద్యార్థినులు ఆరోగ్యంగానే ఉన్నారని చెప్పారు.

సందినేని జనార్దన్‌రావుకు కన్నీటి వీడ్కోలు


నివాళులర్పిస్తున్న జగదీష్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు

నల్లగొండ టూటౌన్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ పట్టణ ప్రధాన కార్యదర్శి సందినేని జనార్దన్‌రావుకు పార్టీ శ్రేణులు, బంధుమిత్రులు కన్నీటి వీడ్కోలు పలికారు. గురువారం నల్లగొండ పట్టణంలోని అమూల్యకాలనీలో గల సందినేని జనార్దన్‌రావు నివాసం నుంచి అంతిమయాత్ర ప్రారంభం కాగా.. హైదరాబాద్ రోడ్డులోని ఐటీ హబ్ వెనుక ఉన్న శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, నల్లగొండ జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు జనార్దన్‌రావు నివాసానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు కటికం సత్తయ్యగౌడ్, చీర పంకజ్‌యాదవ్, కరీంపాషా, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, వంగాల సహదేవరెడ్డి, మాలె శరణ్యారెడ్డి, చిట్ల వెంకటేశం, అభిమన్యు శ్రీనివాస్ ఉన్నారు.

జనార్దన్‌రావు మృతి తీరని లోటు..

సందినేని జనార్దన్‌రావు మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. జనార్దన్‌రావు నిబద్ధత కలిగిన వ్యక్తి అని, ప్రజలకు ఎంతో సేవ చేశాడని కొనియాడారు. రోడ్డు ప్రమాదంలో జనార్దన్‌రావు మృతి చెందడం బాధాకరమని, ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.